# యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం

## వైభవంగా స్వామి, అమ్మవార్లకు లక్ష పుష్పార్చన



లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు



స్వామివారికి లక్ష పుష్పార్చన


యాదగిరిగుట్ట, జనవరి 7 : పంచ నారసింహ స్వామి దివ్య క్షేత్రం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు దినం కావడంతో స్వయంభూ నారసింహ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. క్యూలైన్లు, తిరు మాఢవీధులు, ప్రసాద విక్రయశాల సందడిగా మారాయి. కొండపైకి వాహనాల రద్దీ పెరిగింది. నిత్య తిరు కల్యాణోత్సవం, సువర్ణ పుష్పార్చనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి వారి ధర్మ దర్శనానికి 3గంటలు, వీఐపీ దర్శనానికి 2 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామి వారిని సుమారు 36 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లక్ష పుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. స్వయంభూ ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలతో దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్దారు. అర్చక బృందం, వేద పండితులు స్వామి, అమ్మవార్ల సహస్ర నామ పఠనాలతో వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన పూజలను పాంచరాత్రాగమశాస్త్ర ప్రకారం సుమారు రెండు గంటల పాటు కొనసాగించారు. స్వామి వారి నిత్యోత్సవాలు తెల్లవారు జాము నుంచి మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వయంభూ నారసింహుడిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన నిర్వహించి ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి నిజాభిషేకం, తులసి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్ర నామార్చన జరిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తులకు జరిగే సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బంగారు పుష్పాలతో ఉత్సవ మూర్తిని అర్చించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా సాగింది. ఉదయం స్వామి వారికి సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు కల్యాణమూర్తులకు గజవాహన సేవలను నిర్వహించారు. అనంతరం వెలుపలి ప్రాకార మండపంలో తూర్పు అభిముఖంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణోత్సవం జరిపారు. సుమారు గంటన్నర పాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి సేవోత్సవం, దర్బార్ సేవలు జరుగగా భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలను వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అమ్మవారి పారాయణందారులు పాశురాలను పఠించారు. తిరుప్పావై వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఖజానాకు రూ.43,61283 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారి రామకృష్ణారావు తెలిపారు.

### స్వామివారికి వెండిపూల బుట్ట బహూకరణ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి హైదరాబాద్‌కు చెందిన ఒమేగా ఆసుపత్రి ఎండీ టి. శ్రీకాంతారావు కేజీ వెండితో ప్రత్యేకంగా తయారు చేసిన పూల బుట్టను విరాళంగా సమర్పించారు. ఆదివారం కొండపైకి చేరుకొని ఆలయ ఏఈఓ రఘుకు అందజేశారు.

# గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు పొడిగింపు

- ఈ నెల 20 వరకు అవకాశం



నల్లగొండ, జనవరి 7: గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 20 వరకు పొడిగించినట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ హెచ్. అరుణకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ఇంగ్లిష్ మీడియంలో 5వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఫిబ్రవరి 11న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఎంపిక పాత జిల్లా యూనిట్‌గా పరిగణించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, విద్యార్థులు బోనఫైడ్ లేదా స్టడీ కండక్ట్ సర్టిఫికెట్‌ను దరఖా స్తు వెంట జత చేయాల్సి ఉంటుందని తెలిపారు.

# బస్సులు చాలట్లేవు!

## ప్రయాణికులపై 'మహాలక్ష్మి' ఎఫెక్ట్

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన ప్రయాణికుల రద్దీ
- ప్రముఖ ఆలయాలు, పర్యాటక ప్రాంతాలకు జనం తాకిడి
- యాదగిరి గుట్టకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తుల రాక
- ఉన్న బస్సులతోనే సరి.. కొత్త వాటి ఊసే లేదు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

**ప్రయాణికుల రవాణాకు బస్సులు సరి పోవడం లేదు. మహాలక్ష్మి పథకం ఎఫెక్ట్‌తో ఉమ్మడి జిల్లాలో ప్రయాణికుల సంఖ్య రెట్టింపయ్యింది. యాదగిరిగుట్టతో పాటు పలు క్షేత్రాలకు భక్తుల తాకిడి భారీగా పెరిగింది. పర్యాటక ప్రాంతాలకూ జనం పోటెత్తుతున్నారు. ఆర్టీసీ మాత్రం ప్యాసింజర్ల రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపడంలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు పెంచాలని ప్యాసింజర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.**

*– యాదాద్రి భువనగిరి, జనవరి 7 (నమస్తే తెలంగాణ)/ నల్లగొండ సిటీ*



నల్లగొండ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం అమల్లోకి తీసుకొచ్చింది. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఆధార్ కార్డుతోపాటు పలు గుర్తింపు కార్డులను చూపిస్తూ ఉచితంగా రవాణా చేస్తున్నారు. దాంతో ఒక్కసారిగా జిల్లాలో ప్రయాణికుల తాకిడి పెరిగింది. మహిళలు పుణ్యక్షేత్రాలను దర్శిస్తున్నారు. స్థానికంగా ఉన్న మహిళలంతా ఒక టీముగా ఏర్పడి ఆలయాలకు క్యూ కడుతున్నారు. రెండో తిరుపతిగా ప్రసిద్ధి పొందిన దివ్య క్షేత్రం యాదగిరిగుట్టను నాటి సీఎం కేసీఆర్ అద్భుతంగా తీర్చిదిద్దడంతో స్వామివారిని దర్శించేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వస్తున్నారు. గుట్టతోపాటు ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు జనంతో కిటకిటలాడుతున్నాయి.

### ఉమ్మడి జిల్లాలో 637 బస్సులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏడు డిపోలు ఉండగా అన్ని రకాల బస్సులు కలిపి 634 నడుస్తున్నాయి. ప్రయాణికుల రద్దీతో ఈ బస్సులు ఏమాత్రం సరి పోవడం లేదు. ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) కూడా భారీగా పెరిగింది. ఆర్టీసీ కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నా జిల్లాకు ఎన్ని వస్తాయో చూడాలి మరీ. రద్దీ కారణంగా పిల్లలు, వృద్ధులు బస్సుల్లో నిల్చొని ప్రయాణించక తప్పడంలేదు.

### రాత్రయితే బస్సులు రావు..

చాలా ప్రాంతాలకు రాత్రి అయితే బస్సులు నడువడం లేదు. జిల్లా కేంద్రాలు, పలు పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. రాత్రి 8 గంటల తర్వాత బస్సులు రాకపోవడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. బైపాస్ ఉన్న ప్రాంతాల్లో బస్టాండ్‌లోకి రాకుండా వెళ్తున్నాయి. నకిరేకల్, నార్కట్‌పల్లి తదితర ప్రాంతాల ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారు. బస్సుల సంఖ్య పెంచి, బస్టాండ్‌లోకి బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



యాదగిరిగుట్ట బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

# తండా నుంచి పోలీస్ కమిషనర్‌గా..

- ఎన్నో కష్టాలు ఎదుర్కొని ఐపీఎస్ సాధించిన దామరచర్ల వాసి సైదులు
- తండ్రి మరణించినా తల్లికష్టంతో ముందుకు
- ప్రస్తుతం బెంగళూరు నార్త్‌సిటీ డీసీపీగా విధులు
- పేద విద్యార్థులకు చేయూతనిస్తూ సేవా కార్యక్రమాలు



బెంగుళూరు నార్త్ సిటీ డీసీపీ హోదాలో అడావత్ సైదులు

దామరచర్ల, జనవరి 7 :చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తి, ఉన్నత స్థాయికి ఎదుగాలనే పట్టుదల అతన్ని ఉన్నత స్థాయిలో నిలిపింది. పేదరికం, ఆర్థిక సమస్యలు, తండ్రి మరణం కుంగదీసినప్పటికీ.. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, తల్లి కష్టం ముందుకు నడిపాయి. అతని పట్టుదల, లక్ష్యం ముందు కష్టాలన్నీ బలాదూర్ అయ్యాయి. అంచెలంచెలుగా ఎదుగుతూ అనుకున్న గోల్‌ను సాధించాడు దామరచర్ల మండలం బండావత్ తండా గ్రామ పంచాయతీ పరిధి గేరేతండాకు చెందిన అడావత్ సైదులు. ప్రస్తుతం బెంగుళూరు నార్త్ సిటీ డీసీపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతకుముందు కర్ణాటక రాష్ట్రంలోని లోకాయుక్త ఎస్పీగా, బళ్లారి ఎస్పీగా పని చేశారు.

### 3 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి..

గేరే తండాకు చెందిన అడావత్ సైదులు తల్లిదండ్రులు అడావత్ లక్పతి, సోరు. సైదులుకు ఇద్దరు అక్కాచెల్లెండ్లు. వీరికి తండాలో ఎకరం భూమి ఉంది. తల్లిదండ్రులు వ్యవసాయ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే వారు. సైదులు 3 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి 5వ తరగతి వరకు కొండ్రపోల్‌లోని నేతాజీ పాఠశాలలో చదివాడు. 2002లో మిర్యాలగూడ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 6 నుంచి 10 వరకు చదివాడు. 2004లో ఇంటర్మీడియట్ మిర్యాలగూడలోని వాసవి కాలేజీలో చదివి టౌన్ ర్యాంకు సాధించాడు.

### తల్లి కష్టంతో చదివి..

సైదులు మిర్యాలగూడ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలోనే తండ్రి లక్పతి గుండెపోటుతో మరణించాడు. నాటి నుంచి సైదులు కుటుంబంలో ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. తల్లి సోరు ఎకరం భూమిలో వ్యవసాయం చేస్తూ మరొక పక్క కూలీ చేస్తూ కుటుంబాన్ని పోషించింది. తమ్ముని చదువు కోసం అక్కాచెల్లెండ్లు తమ చదువును మధ్యలోనే మానేశారు. సైదులును మిర్యాలగూడ ప్రైవేట్ కళాశాలలో చేర్పించారు. ముగ్గురు వ్యవసాయ పనులు చేస్తూ వచ్చిన ఆదాయంతో సైదులును చదివించారు. సైదులు ఇంటర్ పూర్తి అయిన తర్వాత బిట్స్‌పిలానీలో సీటు వచ్చినా ఆర్థిక పరిస్థితుల కారణంగా వదిలేసుకున్నాడు.

### తోబుట్టువుల పెండ్లి కోసం జాబ్‌లో చేరి..

బీటెక్‌లో సీటు వచ్చినప్పటికీ కనీసం చార్జీలు లేని కారణంగా సైదులు బ్యాంకులో ఎడ్యుకేషన్ లోన్ తీసుకొని 2008లో ఉస్మానియా యూనివర్సిటీలో చేరాడు. బీటెక్ చేస్తుండగానే రెండు ఉద్యోగాలకు ఆఫర్ వచ్చింది. తప్పని పరిస్థితుల్లో కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా హైదరాబాద్‌లోని క్యాపిటల్ ఐక్యూ కంపెనీలో చేరాడు. జాబ్ చేస్తూ ఎస్ఎండ్ఆర్ పూర్తి చేశాడు. వచ్చిన జీతంతో అక్కాచెల్లెండ్ల పెండ్లి చేశాడు. తండాలో ప్రభుత్వం మంజూరు చేసిన స్థలంలో ఇల్లు కట్టుకున్నాడు.

### గ్రంథాలయాల్లో చదివి

హైదరాబాద్‌లో జాబ్ చేస్తూనే సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యాడు సైదులు. 2013లో సివిల్స్ రాసి విఫలమయ్యాడు. 2015లో మరొక సారి రాసి ఐఆర్ఎస్ సాధించాడు. కానీ వెళ్లలేదు. ఎలాగైన ఐపీఎస్, ఐఏఎస్ సాధించాలనే లక్ష్యంతో రాత్రింబవళ్లు చదివాడు. హైదరాబాద్‌లోని గ్రంథాలయాల్లో పుస్తకాలు తిరగేశాడు. మరొక పక్క మూడు నెలలు డీబీ కుమార్ వద్ద శిక్షణ పొందాడు. 2016లో ఐపీఎస్‌లో 795 ర్యాంకు సాధించాడు. 2016లో కర్ణాటక క్యాడర్‌లో హైదరాబాద్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో జాయిన్ అయ్యాడు. తొలుత బంట్వాల్‌లో అసిస్టెంట్ పోలీస్ సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరాడు. అనంతరం పదోన్నతిపై బెంగళూరు లోకాయుక్త ఎస్పీగా బాధ్యతలు చేపట్టాడు. ఆ తర్వాత బళ్లారి జిల్లా ఎస్పీగా కొంత కాలం పనిచేసి ప్రస్తు తం బెంగళూరు నార్త్‌సిటీ డీసీపీ విధులు నిర్వర్తిస్తున్నాడు.

### పూర్వ విద్యార్థుల సంఘంతో స్వచ్ఛంద సేవలు

జీవితంలో తాను పడ్డ కష్టం ఎవరూ పడకూడదని సైదులు పూర్వవిద్యార్థుల సంఘం పేరా ఆల్మని స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేశాడు. దీని ద్వారా నిరుపేద విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, చదువుకు సహాయ, సహకారం అందించడం చేస్తున్నారు. ఈ సంఘంలో సుమారు రెండువేల మంది సభ్యులున్నట్లు సైదులు తెలిపాడు. పాటుగా సొంత గ్రామం గేరేతండా అభివృద్ధికి కూడా తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నాడు. సైదులు జీవితం ఆదర్శంగా తీసుకొనేలా తెలంగాణ గిరిజన గురుకుల శాఖ అధికారులు విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలపై సైదులు ఫొటోను, అతని జీవితంలో ప్రధానాంశాలను ముద్రించారు.



మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర కోటేశ్వర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, నాయకులు


# మున్సిపల్ వైస్ చైర్మన్ కోటేశ్వర్‌రావు సేవలు మరువలేనివి

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మిర్యాలగూడ, జనవరి 7 : మిర్యాలగూడ పట్టణాభివృద్ధికి మున్సిపల్ వైస్‌చైర్మన్ దివంగత కుర్ర కోటేశ్వర్‌రావు చేసిన సేవలు మరువలేనివని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని నందిపాడులోని టీఎన్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన కోటేశ్వర్‌రావు సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి కోటేశ్వర్‌రావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండలి చైర్మన్ మాట్లాడుతూ మిర్యాలగూడ అభివృద్ధికి కోటేశ్వర్‌రావు అనేక కార్యక్రమాలు చేపట్టి ఇక్కడి ప్రజల హృదయాల్లో చెరుగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆయన మృతి పట్టణ ప్రజలకు తీరని లోటన్నారు. ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడుతూ కోటేశ్వర్‌రావు బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడంలో కీలక పాత్ర పోషించారని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూకలంటి రంగారెడ్డి, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుందూరు వీరకోటిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ సీడీ.రవికుమార్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మోసీన్‌అలీ, నాయకులు గుత్తా అమిత్‌రెడ్డి, నల్లమోతు సిద్ధార్థ, చిట్టిబాబునాయక్, జొన్నలగడ్డ రంగారెడ్డి, నామిరెడ్డి యాదగిరిరెడ్డి, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# 9న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

నల్లగొండ, జనవరి 7: ఈ నెల 9న నల్లగొండ జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఒకటో స్థాయీ సంఘం(ఆర్థికం), రెండో స్థాయీసంఘం(గ్రామీణాభివృద్ధి), నాలుగో స్థాయీసంఘం (విద్య, వైద్యం), ఏడో స్థాయీసంఘం( పనులు) సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మూడో స్థాయీ సంఘం(వ్యవసాయం), 2 గంటలకు ఐదవ స్థాయీ సంఘం (స్త్రీ, శిశు సంక్షేమం), 3.30 గంటలకు ఆరో స్థాయీ సంఘం (సాంఘిక సంక్షేమం) సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశాలకు అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు సకాలంలో హాజరు కావాలని కోరారు.



టీఎస్‌యూటీఎఫ్ సంఘం బాధ్యులు సమక్షంలో ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

# టీఎస్‌యూటీఎఫ్ మైనార్టీ గురుకుల ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక

రామగిరి, జనవరి 7 : టీఎస్‌యూటీఎఫ్ మైనార్టీ గురుకుల ఉమ్మడి జిల్లా కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నల్లగొండలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన గురుకుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో కమిటీని ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా బొల్లెం కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా ప్రసాద్, కోశాధికారిగా కోమటి రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా జ్యోతిబాబు, నూర్జహాన్, కార్యదర్శులుగా శంకర్, కె. రమాదేవి, అబ్దుల్ ముజీబ్, జంగయ్య, శ్వేత, అనిత ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాంబాబు, రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జి. క్రాంతి కుమార్, బొల్లం కృష్ణమూర్తి, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు కొప్పుల జనార్దన్, లక్ష్మణ్, మైనార్టీ గురుకులాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేడు నల్లగొండ మున్సిపాలిటీలో అవిశ్వాసం

- ఇప్పటికే విప్ జారీ చేసిన బీఆర్ఎస్
- కాంగ్రెస్ క్యాంపులో 34 మంది కౌన్సిలర్లు
- అవిశ్వాసం నెగ్గితే పదవి కోల్పోనున్న 15 మంది కౌన్సిలర్లు
- భారీ బందోబస్తును ఏర్పాటు చేసిన పోలీస్ యంత్రాంగం



నల్లగొండ మున్సిపల్ కార్యాలయం

నీలగిరి, జనవరి 7 : నల్లగొండ మున్సిపల్ చైర్మన్ పదవిపై సోమవారం నిర్వహించనున్న అవిశ్వాస తీర్మాణానికి ఓటింగ్ జరుగనుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ క్యాంపు రాజకీయాలకు తెరలేపి 34 మంది కౌన్సిలర్లను శనివారం క్యాంపునకు తరలించింది. నేరుగా మున్సిపల్ సమావేశ మందిరానికి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అవిశ్వాసం నెగ్గకుండా ఉండేలా చూస్తున్నట్లు తెలుస్తున్నది. ఇందుకు బీఆర్ఎస్ నుంచి గెలిచిన కౌన్సిలర్లకు ఆ పార్టీ విప్ జారీ చేసింది. కొంతమందికి విప్ అందజేయగా మరికొందరు అందుబాటులో లేకపోవడంతో వారి ఇండ్ల వద్ద విప్‌ను అంటించారు. ఒకవేళ బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓటు వేసిన వారిపై చర్యలు తీసుకునేలా ఇప్పటికే విప్ జారీ చేసి సంబంధిత కాపీలను కలెక్టర్‌కు అందజేశారు. గతంలో కనగల్ మండలంలో విప్ ధిక్కరించిన వారు పదవులు కోల్పోవడంతోపాటు ఉప ఎన్నికలు జరిగాయి. దాంతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పోయిన కౌన్సిలర్లలో కొంత అలజడి మొదలైంది. పదవి కోల్పోవాల్సి వస్తే తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ క్యాంపులో ఉన్నప్పటికీ ఓటు వేయాలా వద్దా అనే డైలామాలో ఉన్నట్లు వినికిడి.

### 15 మంది కౌన్సిలర్లకు పదవి గండం...

నల్లగొండ మున్సిపాలిటీలో 48 వార్డులకు బీఆర్ఎస్ 20, కాంగ్రెస్ 20, బీజేపీ 6, ఎంఐఎం ఒకటి, స్వతంత్రులు ఒకరు గత ఎన్నికల్లో విజయం సాధించారు. ఎంఐఎం, స్వతంత్రులు, ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలుపుకొని అప్పట్లో బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకుంది. తరువాత కాంగ్రెస్ కౌన్సిలర్ మృతి చెందడంతో అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించాడు. కాంగ్రెస్‌కు చెందిన మరో కౌన్సిలర్ బీఆర్ఎస్‌లో చేరడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్ల సంఖ్య 22కు కాంగ్రెస్ సంఖ్య 18కి చేరింది. శాససభ ఎన్నికలు సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన 9 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల తరువాత మరో ఆరుగురితోపాటు స్వతంత్రులు కలిపి మొత్తం ఏడుగురు కాంగ్రెస్‌లో చేరారు. దాంతో మున్సిపాలిటిలో కాంగ్రెస్ బలం 34కు చేరింది. వీరంతా కలిసి చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటించారు. ఈ అవిశ్వాసం నెగ్గితే బీఆర్ఎస్ నుంచి గెలిచిన 15 మంది కౌన్సిలర్లకు పదవి గండం ఏర్పడనుంది. కాగా, అవిశ్వాస పరీక్షలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది.

### ఆందోళన తెప్పిస్తున్న రేగట్ట, కనగల్ పరిస్థితులు

గతంలో కనగల్ మండలంలో రేగట్ట, కనగల్ ఎంపీటీసీలు పార్టీ విప్‌నకు వ్యతిరేకంగా ఓటింగ్‌లో పాల్గొనగా పదవులు కోల్పోయారు. దాంతో ఉప ఎన్నికలు కూడా జరిగాయి. ఇదే తరహాలో నల్లగొండ మున్సిపాలిటీలోనూ విప్‌నకు వ్యతిరేకంగా ఓటేస్తే తమ పదవులు కోల్పోవాల్సి వస్తుందనే ఆందోళన మొదలైంది.

# చార్జీల తగ్గింపును నిరసిస్తూ హమాలీల ధర్నా



ఆర్టీసీ కార్గో సెంటర్ ఎదుట ధర్నా చేస్తున్న హమాలీలు

నల్లగొండ సిటీ, జనవరి 7 : ఆర్టీసీ కార్గో సెంటర్‌లో పనిచేస్తున్న హమాలీల చార్జీలు తగ్గించడాన్ని నిరసిస్తూ ఆర్టీసీ హమాలీ వర్కర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ బస్టాండ్‌లోని కార్గో సెంటర్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుంటే హమాలీ చార్జీలు పెంచాల్సింది పోయి తగ్గించడం అన్యాయమన్నారు. దీని ద్వారా 30 సంవత్సరాలుగా బస్టాండ్‌లో సరుకులు ఎగుమతి దిగుమతి చేస్తూ జీవనోపాధి పొందుతున్న కూలీలు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకిందని పేర్కొన్నారు. గతంలో ఒక పార్సిల్‌కు రూ.10 ఇస్తూ.. దాని బరువు పెరిగే కొద్ది కూలీ పెరుగుతుండేదన్నారు. కానీ ఆర్టీసీ సంస్థ సాఫ్ట్‌వేర్ మార్చి కనీస పార్సల్ రేటును ఐదు రూపాయలకు తగ్గించడం అన్యాయమన్నారు. కస్టమర్ చార్జీలు పెంచి హమాలీ చార్జీలు తగ్గించడం సరికాదని, దీనిని వెంటనే రద్దు చేసి మునుపటి చార్జీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీలు పోలె సత్యానారాయణ, నీల నరసింహ, అశోక్, మల్లేశ్, భిక్షం, శంకరయ్య పాల్గొన్నారు.